నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | SIDDIPET

ఉగాదికి స్వాగతం..

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉగాది పర్వదినాన్ని వైభవంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముందుగానే ఆరు రకాల రుచులతో తయారు చేసిన పచ్చడిని ఇంటిల్లిపాది ఆస్వాదించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ పఠనాల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగకు కావాల్సిన సామగ్రి కొనుగోళ్లతో సోమవారం మార్కెట్లలో సందడి నెలకొంది.
– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఉగాది పర్వదిన శుభాకాంక్షలు

• మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 8: తెలుగు నూతన సంవత్సరాది శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలన్నారు. ఉగాది పచ్చడిలాగే మీ జీవితం కూడా షడ్రుచుల సంగమంగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం మరింత శోభాయమానంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు పాడి పంటలతో ఆనందంగా వర్ధిల్లాలన్నారు. ఈ ఏడాదిలో అన్నింటా శుభం జరగాలని, కొత్త సంవత్సరం అందరి కుటుంబాల్లో వెలుగులు నింపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే కరువు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి



మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో రైతు దేవయ్యతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 8: రైతన్నలు ఎదుర్కొంటున్న కరువు కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఐదెకరాల వరి పంట ఎండిపోయి, తీవ్రంగా నష్టపోయిన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్‌కు చెందిన రైతు పెద్దకారి దేవయ్య పొలాన్ని సందర్శించి, ఆయన్ను పరామర్శించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీనిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో మండుటెండల్లో సైతం పుష్కలంగా నీరు ఉండేదని, దీంతో వానాకాలం, యాసంగి పంటలకు ఎలాంటి ఢోకా లేదన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో సమయానికి నీళ్లు వదలక పోవడంతో పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతు దేవయ్య ప్రతాప్‌రెడ్డితో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుంట పొలం కూడా ఎండిపోయేది కాదని, 24 గంటల ఉచిత కరెంటుతో పాటు, ఎండాకాలంలో సైతం నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదన్నారు. తమకున్న ఐదెకరాల పొలం ఎండిపోవడంతో తినడానికి తిండి కూడా లేదంటూ కన్నీరు పెట్టుకున్నాడు. అప్పుచేసి మరీ ఎకరానికి రూ.30 వేల చొప్పున సుమారు రూ.లక్షా యాభై వేలు పెట్టుబడి పెట్టానని, అంతా బూడిదలో పోసిన పన్నీరైందన్నారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు, మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, పూటకోమాట మాట్లాడుతూ రైతులను నిండా ముంచిందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఎడారిలా ఉన్న తెలంగాణ, స్వరాష్ట్రం సిద్ధించాక సస్యశ్యామలంగా మారిందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కితే, అధోగతి పాలు చేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండపోచమ్మ, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్‌లో పుష్కలంగా గోదావరి జలాలు ఉండేవని, ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా కరీంనగర్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో రైతులకు తాగునీరందించిందన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాణీసత్యనారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్, కృష్ణారెడ్డి, రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేట గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా

మన నేల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం..

- మీరే మా బలం, బలగం..
- మీ కోసం 18 గంటలు పనిచేశా..
- కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి
- సోషల్ మీడియాలో యువత చురుగ్గా పనిచేయాలి
- అన్ని విషయాల్లో కాంగ్రెస్ మోసం చేసింది..
- ప్రజల్లో కాంగ్రెస్ చేసిన మోసాలను చర్చకు పెట్టాలి..
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేటలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 8: సిద్దిపేట గడ్డ..బీఆర్ఎస్ అడ్డా అని, మన నేల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని.. మీరు 30 రోజులు కష్టపడితే..మీకు అండగా ఉంటానని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట నియోజకవర్గ బీఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా వారియర్స్‌తో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాకపోతే, సిద్దిపేట జిల్లా అయ్యేదా.. ఇంత అభివృద్ధి జరిగేదా అన్నారు. ఇదంతా బీఆర్ఎస్ వల్లనే జరిగిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ఎంతోమంది యువకులు తెలంగాణ పోరాటంలో లాఠీ దెబ్బలు తిన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వారియర్స్ తిప్పికొట్టాలన్నారు. మీలో నుంచే రేపటి తరం నాయకులు పుడతారన్నారు. కనీసం 25 శాతానికి తగ్గకుండా స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో ఏ అవసరం ఉన్నా.. ఆపదైనా, సంపద అయినా, కష్టమైనా, సుఖమైనా..తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కంటి రెప్పలా యువకులను కాపాడుకుంటానని చెప్పారు. దేశంలో ఏ అవార్డు ఇచ్చినా.. సిద్దిపేట పేరు లేకుండా అవార్డు లేనేలేదన్నారు. పదోతరగతి ఫలితాల్లో కూడా సిద్దిపేట జిల్లాను అగ్రగామిగా నిలిపామన్నారు. దానగుణం, కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆయనను గెలుపించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. విద్యానిధి ద్వారా విద్యార్థులకు సాయం చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజల్లో చర్చ పెట్టాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అయినవాళ్లను కాంగ్రెస్‌కు, కానివాళ్లు కారుకు ఓటు వేయాలన్నారు. రూ.4 వేల పింఛన్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500, పంటలకు రూ.500 బోనస్, రైతుబంధుపై కూడా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. మోసం చేసిన కాంగ్రెస్‌వోళ్లకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్‌రావు కూడా ఎడ్లు, బండి, నిరుద్యోగ భృతి అని చెప్పి అక్కడి ప్రజలను మోసం చేస్తే.. దుబ్బాక ప్రజలు 54 వేల ఓట్లతో కర్రుకాల్చి వాత పెట్టారన్నారు. దుబ్బాకలో చెల్లని వ్యక్తి సిద్దిపేటలో చెల్లుతాడా.. అని అడిగారు. అనేక గ్రామాల్లో ఆలయాలకు నిధులు ఇచ్చానని, సిద్దిపేట జిల్లా కావడం, నీళ్లు, రైలు ఇలా అన్ని బీఆర్ఎస్ వల్లనే వచ్చాయన్నారు. జిల్లాలు రద్దు చేస్తే సిద్దిపేట జిల్లా ప్రజలు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెడతారన్నారు. అసెంబ్లీలో తాను కాంగ్రెస్ పార్టీని నిలదీయాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. తాను తీసుకొచ్చిన వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించారని.. రూ.150 కోట్ల అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ నిలిపివేసిందన్నారు. సిద్దిపేటపై రేవంత్‌రెడ్డికి అంత పగ ఎందుకు అని ప్రశ్నించారు. మనల్ని ఆగం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మీరు ఎక్కడికి వెళ్లినా సిద్దిపేట గడ్డ గౌరవం పెరిగేలా పనిచేశామన్నారు. మీ ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిగా పని చేశానని.. ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా 18 గంటలు పని చేశానన్నారు. నా ఊపిరి ఉన్నంత కాలం సిద్దిపేట గడ్డ కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు మేరుగు మహేశ్, యాదగిరి, రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేటలో సమావేశానికి హాజరైన విద్యార్థి, యువజన విభాగం, సోషల్ మీడియా వారియర్స్

సేవ చేసేందుకే ఎంపీగా పోటీ చేస్తున్నా..

బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 8: పనిచేసినచోటే ప్రజాసేవ చేసేందుకు ఎంపీగా పోటీ చేస్తున్నానని మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. మీరంతా సైనికుల్లా పని చేసి ఎంపీగా గెలిపించాలన్నారు. ఐఏఎస్ అధికారిగా ఇక్కడ ఐదేండ్లు పనిచేసిన ఘనత నాకే దక్కిందని, మాజీసీఎం కేసీఆర్, హరీశ్‌రావు సహకారంతో సిద్దిపేట జిల్లాను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. ప్రజలకు సేవచేయాలనే ఆరాటంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమేనని యువతకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. నిరుపేదల చదువు కష్టాలు కళ్లారా చూశానని, యువకుల కోసం రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు అధ్యాపకులతో ఉచిత కోచింగ్ ఇప్పిస్తానని, వృత్తి నైపుణ్య శిక్షణ అందించి, 6 మాసాలకోసారి జాబ్ మేళా ఏర్పాటు చేసి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి రూ.2 కోట్లు వెచ్చించి ఫంక్షన్ హాళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్‌తో పాటు నిరుపేదలకు కేవలం రూ.1కే అందించనున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల గుణగణాలను చూసి ఓటువేయాలని పిలుపునిచ్చారు. 35 రోజులు మీరు పనిచేస్తే ఐదేండ్లు మీ వెంట ఉండి మీకు సేవ చేస్తానన్నారు. ఉద్యమాల గడ్డ సిద్దిపేట..ఎంపీ అభ్యర్థి విజయంలో కీలక పాత్ర పోషించి పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం కల్పించాలన్నారు.

సిద్దిపేటలో సమావేశానికి హాజరైన విద్యార్థి, యువజన విభాగం, సోషల్ మీడియా వారియర్స్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశం అనంతరం గెల్లు శ్రీనివాస్‌తో యువజన, విద్యార్థి నాయకులు

- కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్
- హుస్నాబాద్‌లో యూత్, విద్యార్థి విభాగంతో సమావేశం

హుస్నాబాద్, ఏప్రిల్ 8: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీచైర్మన్ గెల్లు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఈనెల 13న జరగనున్న నియోజకవర్గస్థాయి విద్యార్థి, యువజన చైతన్య సదస్సు విజయవంతం కోసం సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయించడమే కాకుండా కేంద్రం నుంచి నిధులు తెచ్చిన ఘనత వినోద్‌కుమార్‌కే చెందుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను కూడా గ్రామస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులు, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించి ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసేలా ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్, బొజ్జ హరీశ్, వికాస్‌యాదవ్, నవీన్‌రెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి

- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- నర్సాపూర్‌లో కార్యకర్తల సన్నాహక సమావేశం

జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, నాయకులు

నర్సాపూర్, ఏప్రిల్ 8: ప్రజలకు హామీలిచ్చి మాట తప్పిన పార్టీలు కావాలా, ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలు నెరవేర్చిన బీఆర్ఎస్ కావాలా తేల్చుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్‌లో కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి హరీశ్‌రావు, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, దేశపతి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో బస్‌డిపో, చెక్‌డ్యామ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తుచేశారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా నర్సాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. బాండు పేపర్లు సైతం రాసిచ్చి అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నాయకులు మాట తప్పారని వెల్లడించారు. ఆరు గ్యారెంటీల పేరుతో జనాలను మోసం చేసి ఓట్లు దండుకున్నారన్నారు. సీఎం రేవంత్ ఏనాడైనా జై తెలంగాణ అన్నాడా... జై తెలంగాణ అన్నవారిపై తుపాకీ పట్టుకొని బయలుదేరిన చరిత్ర ఆయనదన్నారు. అమరవీరుల స్థూపం వద్ద ఒక్కనాడైనా రేవంత్ రెండుపూలు వేశాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఓట్లకు ఇంటికొస్తే ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు సూచించారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతును గెలిపించాలని, మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పేదలను ఆదుకొని వారి మన్ననలు పొందాడని గుర్తుచేశారు. బీజేపీ అభ్యర్థికి ఓట్లు అడిగే అర్హతే లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్‌లో బీఆర్ఎస్ తరపున తాను గెలిచినట్లే ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలువడం తథ్యమని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై బీఆర్ఎస్ సత్తా చాటారని, వ్యక్తులు కాదు, పార్టే ప్రధానమని బీఆర్ఎస్ కార్యకర్తలు నమ్మారని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పేదలకు ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. ఆయనకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీని అందిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో గెలిస్తే పీవీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.1కే పెండ్లీలు చేసుకోవడానికి ఫంక్షన్ హాల్ ఇప్పిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. 35 రోజులపాటు తనకోసం పనిచేయాలని కార్యకర్తలను కోరారు. పీవీఆర్ ట్రస్ట్ ద్వారా రూ.100 కోట్లతో సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ మహేశ్‌గుప్తా, నాయకులు సత్యంగౌడ్, సంతోష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితం.. మల్లన్న అగ్నిగుండం

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం దాటిన భక్తులు

మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులు

- 12 ఆదివారాల పాటు భారీగా తరలివచ్చిన భక్తజనం
- ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు

అగ్నిగుండం దాటుతున్న ఆలయ అర్చకులు

చేర్యాల, ఏప్రిల్ 8 : మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన అగ్నిగుండాలు ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమై సోమవారం వేకువజాము వరకు ఉత్కంఠభరితంగా సాగింది. ఆలయ వర్గాల నేతృత్వంలో వికారాబాద్ జిల్లా కెంపిన మఠం మఠాధీశులు చెన్న బసవప్రభు మహాస్వామీజీ వైదిక పర్యవేక్షణలో నిర్వహించిన అగ్నిగుండాలు ఆద్యాంతం వైభవంగా జరిగాయి. అగ్నిగుండం స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరడంతోపాటు కష్టాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన పర్వాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేదిక ప్రాంగణంలో రాత్రి 7 గంటలకు వీరభద్ర ప్రస్తాయం, భద్రకాళి పూజ,11 గంటలకు అగ్నిగుండాలు నిర్వహించారు. సోమవారం ఉదయం గురుపూజ, బలిహారణం, అగ్నిగుండాల ప్రవేశం, విజయోత్సవం, స్వామి, అమ్మవార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, మహామంగళ హారతి, మంత్రపుష్పం, జంగమార్చన, అనంతరం తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

వైభవంగా అగ్నిగుండాలు

ఆలయ వర్గాలు వీరశైవ ఆగమశాస్త్ర పద్ధతిలో అగ్నిగుండాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా మర్రి, మేడి, మామిడి, మోదుగు, జువ్వి(ఐదు రకాల చెట్లకు సంబంధించి) కర్రలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిప్పులుగా తయారు కాగానే వాటిని అగ్నిగుండంగా తయారు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు గర్భాలయం నుంచి కల్యాణ వేదికకు తీసుకొచ్చి భక్తులు అగ్నిగుండం దాటిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలు 12వ ఆదివారం సందర్భంగా నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిశాయి. కార్యక్రమంలో ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో సీఐ శ్రీను నేతృత్వంలో ఎస్సైలు నాగరాజు, దామోదర్, యూనస్‌అలీ సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

- ప్రజల గుండెల్లో ఉన్నది కేసీఆర్ ఒక్కరే..
- బీఆర్ఎస్‌కు బలగం.. బలం కార్యకర్తలే..
- ప్రజల కష్టాలు దూరం చేసే పార్టీ బీఆర్ఎస్ మాత్రమే...
- రైతులను రాజు చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యం
- పోరాడి ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించుకోవాలి
- బాన్స్‌వాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- కల్వకుర్తి, పెద్దశంకరంపేట్ మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

కల్వకుర్తి, ఏప్రిల్ 8: తెలంగాణ ప్రజల గుండెల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నది ముమ్మాటికీ నిజమని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై ప్రజలు నిరాశ చెందారే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో గెలిపించలేదని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కల్వకుర్తి, పెద్దశంకరంపేట్ మండలాల ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో పార్టీ అభివృద్ధికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీల గురించి అందరికీ తెలుసని, అబద్ధాలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డిని అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్నారు. నియోజకవర్గంలో సాగు నీరులేక పూర్తిస్థాయిలో పంటలు పండించలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన స్పందించి కాళేశ్వరం నీటిని సింగూర్‌కు తరలించేందుకు బసవేశ్వర లిఫ్టుతో నియోజకవర్గంలో లక్ష 60వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. 50 టీఎంసీల సామర్థ్యం గల మల్లన్న సాగర్ నుంచి 18 కిలోమీటర్ల సొరంగం 200 మీటర్ల లోతుతో 6కిలోమీటర్లు కాల్వ నిర్మించి తరలించేందుకు పనులు చేపట్టారన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బసవేశ్వర లిఫ్టును రద్దు చేయడం రైతుల నోట్లో మట్టికొట్టినట్లయిందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహాయ సహకారాలతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హయాంలోనే నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు.

పంటలు ఎండబెట్టే కాంగ్రెస్‌కు ఓట్లెందుకు వేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బాన్స్‌వాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ ఒకసారి, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ రెండుసార్లు ఎంపీగా గెలుపొంది నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమీలేదని విమర్శించారు. పంటలు ఎండబెట్టే కాంగ్రెస్‌కు ఓట్లు ఎందుకు వేయాలో రైతులు ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్‌లో గెలుపొందిన కొందరూ కాంగ్రెస్‌లో చేరడం దుర్మార్గమని, రానున్న రోజుల్లో వారి బతుకులు బజారుపాలవుతాయని జోష్యం చెప్పారు. మనశక్తిని తక్కువ అంచనా వేసుకోకుండా గట్టిగా పోరాడితే ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయం తథ్యమన్నారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని 60 ఏండ్లలో వెనుకబాటుకు గురిచేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో వందల కోట్ల నిధులతో మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడిక పనులు చేపట్టామని, 8 నూతన చెరువులు మంజూరు చేశామన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు గురుకులాలు, దవాఖానలు నిర్మించామన్నారు. నల్లవాగు ప్రాజెక్టు కూడికాల్వ కింద యాసంగిలో బీబీపేట్, ఫత్తేపూర్, మార్డి, ఖానాపూర్ కే, కృష్ణాపూర్, ఇందిరనగర్, కల్వకుర్తి గ్రామాల రైతులు సాగు చేసిన పంటలకు సరిపడా నీరు ప్రాజెక్టులో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నీరందించక ఎండిపోయాయన్నారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పొట్టకూటి కోసం ప్రజలు వలసలు వెళ్తున్నారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సంతోష్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా క